## అసలైన ఏప్రిల్ ఫూల్ కథ

1939 రెండో ప్రపంచ యుద్ధం ముమ్మరంగా జరుగుచున్నది. ఆమెరికా నౌకాదళానికి చెందిన ఏప్రిల్ బై అనే యుద్ధనౌక మనిలా అఖాతంలో లంగరేసుకుంది. అత్యంత సమృద్ధుడూ, మిక్కిలి హాస్య ప్రియుడూ అయిన జె. జె. స్వీనీ కెప్టెన్‌గా వున్నాడు. నౌకలో వున్న యితర అధికారులంతా అతనిచేత "కాజాలు" తిన్నవారే. అయితే అతని మీద తిరిగి జోకెయ్యడానికి ఎవరికీ దమ్ములేవు. కమాండింగ్ ఆఫీసరు, కెప్టెను పైగా యుద్ధ సమయం!

కాని, ఏప్రిల్ ఫస్టు సంగతి వేరు. కనక, అతనిచేత ఎలాగైనా "కాజా" తినిపించాలన్న కుతి మిగతా ఆఫీసర్లకి కలిగింది. చిన్న చిన్నవి పనికిరావు. అతని బ్రేక్ ఫాస్టులో విరేచనం మందు కలపడం, అతను టౌన్‌లో కెళ్ళే లాంచీకి లంగరు తప్పించేడం ఇలాంటివి కుర్ర తరహా చేష్టల్లా కనిపించి కమ్యూనికేషన్స్ ఆఫీసర్ "లెడ్‌రర్" అనే ఆయన ఒక బ్రహ్మాండమైన ప్లాను తయారు చేశాడు.

కెప్టెన్ స్వీనీకి మనిలా నగరంలో ఇల్లుంది. భార్య, ముగ్గురు పిల్లలూ వున్నారక్కడ. రోజూ వెళ్ళి రాగలుగుతున్నాడు. అతనికి చైనీస్ ఆహారం రోత. కనక, అతనికి ఇక్కణ్ణుంచి చైనా అంత

ర్భాగంలో చున్‌కింగ్ నౌకా స్థావరానికి ట్రాన్స్‌ఫరైనట్టు రేడియో ప్రింటర్‌మీద ఆర్డర్ సృష్టించి, ఉదయం ఎనిమిదిన్నరకి అందచేశారు. ఏప్రిల్ 9ని చున్‌కింగ్‌లో జాయినవ్వాలి.

కెప్టెన్ నిప్పుతొక్కిన కోతిలా గంతులేశాడు. "నా ఇల్లేంకాను, నా పెళ్ళాం పిల్లల్ని అమెరికా ఎలా పంపను. ఆ దిక్కుమాలిన చైనీస్ ఆహారం ఎలా తినను. దొంగ వెధవలు ఎనిమిదిరోజుల వ్యవధిలో మూడువేల మైళ్ళు ట్రాన్స్ఫర్ చేస్తారా" అంటూ.

వెంటనే లాంచీ ఎక్కి టౌనుకి ప్రయాణమయ్యాడు. ఒంటి గంట ప్రాంతానికి తిరిగి నౌకలో కొచ్చి లంచ్‌లో కూర్చున్నాడు మొహం బాగా వేలేశాడు. "వెధవార్డర్సూ వీళ్ళూను" అని నౌకాదళాధి కారులని తిట్టాడు మళ్ళీ. "మా ఆవిడ ఈ ఆర్డర్సు చూసి ఏడ్చేసింది! తనకి మనిలా వొదిలి వెళ్ళాలని లేదసలు. కాని ఇక్కడుండడం శ్రేయ స్కరం కాదు." అని ప్లేట్లో పదార్థాలని కెక్కరించసాగాడు.

"బాగానే పనిచేసింది జోకు" అన్నట్టుగా, మిగిలినవాళ్ళు తొడలు గిల్లుకున్నారు వొకరి కొకరు.

"అయితే, అన్నీ మన మంచికే అన్నట్టుగా ఉదయం పదింటికి నా యింటికి బేరం వొచ్చేసింది. పదహారు వేలకి కొన్నానా, 17200కి అమ్మేశాను!" అని జేబులోంచి వో చెక్కు తీసి ప్రదర్శించాడు.

అందరూ మొహాలు చూసుకున్నారు. "ఏప్రిల్ ఫూల్" అని పాడే సమయం ఎప్పుడాని.

"అంతేకాదు. నెల పదిహేను రోజుల్దాకా మనిలా నుంచి అమెరికాకు మన షిప్పులులేవు కదా, వీళ్ళందరూ ఎలా వెడతారూ అనుకుంటుండగానే, రేపు సాయంకాలం ఇక్కణ్ణుంచి ఒక వ్యాపార నౌక బయల్దేరుతున్నట్టు తెలిసింది. దాంట్లో కష్టపడి నాలుగు టిక్కెట్లు తీసి చూపాడు కెప్టెన్.

"కొంపతీశా(డా బాబూ" అని మొహాలు వేలవేశారందరూనూ.

"ఆర్డర్సంటే ఆర్డర్సే మరి. ఒబె చెయ్యాళలి. అయినా స్వల్ప వ్యవధిలో ఇంతదూరం కదుపుతున్నందుకు నా నిరసన కూడా తెలియ జేస్తూ నేవీ చీఫ్‌కి సందేశం పంపమని ఎడ్మిరల్‌కి చెప్పాను" అన్నాడు కెప్టెన్ స్వీనీ మరికొద్దిసేపు పోయాక.

దీంతో అందరికీ మతులు పోయాయి. మిగతావాటి మాట ఎలా వున్నా, ఈ మెసేజ్ వెళ్ళిపోతే ఇన్‌వెస్టిగేషన్ తప్పదు. కనీసం సగం మంది ఉద్యోగాలు పోవడం తథ్యం.

"నే వెళ్తున్నాను, సామాన్లు ప్యాకింగుంది" అని కెప్టెన్ లేచాడు. లెడరర్‌కి ఇటూ అటూ వున్న ఆఫీసర్లు అతన్ని పొడిచారు. "కెప్టెన్, ఒకమాట" అని అతనితో కాబిన్ కెళ్ళాడు లెడరర్. "పార్టీయేగా; చేసుకుందాం. దానికేం వుందీ" అని కెప్టెన్ త్వరపడ్డాడు.

"అది కాద్సార్! ఈ ఆర్డరు- మేం అంతా కలసి వేసిన ఏప్రిల్ ఫూల్ జోక్ సార్" అని అతికష్టంమీద విన్నవించాడు లెడరర్.

కెప్టెన్ క్షణంపాటు కోపం తెచ్చుకొని, మళ్ళీ అంతలోనే జోక్‌కి నవ్వేసి, మరుక్షణంలో నిర్ణయం తీసుకున్నాడు. రేడియో ప్రింటర్ ఉపయోగించి తప్పుడు సందేశాన్ని సృష్టించడం లెడరర్ చేసిన అధికార దుర్వినియోగం. దానికి అతనికి శిక్ష తప్పకపోవచ్చు. అయితే, తాను అమ్మేసిన యిల్లు మళ్ళీ తనకి దఖలుపడాలి. తన కుటుంబాన్ని పంపడంకోసం కొన్న టిక్కెట్ల సొమ్ము కూడా వాపసు రావాలి. ఎడ్మిరల్ నుంచి నేవీ చీఫ్‌కి సందేశం వెళ్ళకుండా ఆపాలి. "ఇవన్నీ నువ్వు చూసుకోగలిగావంటే, కోర్టు మార్షల్ లేకుండా చేస్తాను!" అని ఇల్లమ్మగా వొచ్చిన చెక్కు, టిక్కెట్లు లెడరర్ కందించి "ఇవన్నీ రేపు ఉదయంలోగా చెయ్యలేక పోయావో, నేను నీ మీద చర్య తీసుకోక తప్పదు" అన్నాడు.

"యస్సార్" అని లాంచీ తీసుకొని టౌన్లోకి పరుగెత్తాడు లెడరర్.

ఇల్లు అమ్మడానికి సాయపడే ఎస్టేటు ఏజెంటు తాను ఆ ఇంటిని మరొక గంటలోనే ఇంకొకరికి అమ్మేసినట్టు; ఆ లాభం ఎనిమిది వందలు యిచ్చేసినట్లయితే ఆ ఆపద తప్పించ గలిగేటట్లు చెప్పాడు. ఎనిమిదివందల డాలర్లు ఒక్కసారి ఇచ్చుకోలేను; యాభై చొప్పున కట్టేస్తానని కాళ్ళావేళ్ళాపడి ఆ వ్యవహారం ఫైసలు చేశాడు లెడరర్.

షిప్పింగ్ ఆఫీసువాళ్ళు టిక్కెట్లు వాపసు తీసుకోడానికి నోటీసు చాలదన్నారు. మార్గాంతరం లేదా అంటే ఉంది, అలాంటి ఆర్డర్ మేనేజరు గొంజేల్సుగారే వెయ్యాలి అన్నారు. ఆ మహానుభావుడు రేపు తెల్లారి ఆరు గంటలకు హాంకాంగ్ వెళ్ళిపోతున్నాడట. రాత్రి పోలో క్లబ్‌లో కాక్‌టెయిల్ పార్టీ యిస్తూ ఆ ఏర్పాట్లలో వున్నాట్ట. ఆ పార్టీకి కేవలం ఆహ్వానితులే రావాలి. దానికి ప్రత్యేకమైన డ్రస్సు వుండాలి. అప్పటికి రాత్రి ఎనిమిది, పోలో క్లబ్ గేటు దగ్గర నిర్దాక్షిణ్యంగా అడ్డేశారు.

ఆ తరవాత కొంతసేపటికి లెడరర్ స్నేహితురాలు బెస్సీ హేకెట్ అనే ఆమె ఆ పార్టీకి వెళ్తూ అతన్ని గుర్తుపట్టి, తన దగ్గరున్న ఇన్విటేషన్ సహాయంతో, తన అన్నగారి బట్టల్లోంచి ఏరిన డ్రస్సుతో, లెడరర్‌కి పోలో క్లబ్‌లో ప్రవేశాన్ని సాధ్యం చేసింది. డ్రస్సు అవకతవగ్గా వుండడాన్ని కొంత అపహాస్యంపాలైనా, అక్కడ పని జరిగింది. ఎలాగైతేనేమి "టిక్కట్లు తీసుకుని డబ్బు ఇచ్చేయండి" అని గొంజేల్సుగారు స్లిప్పు రాశిచ్చాడు.

రాత్రి పది దాటింది. మళ్ళీ యూనిఫారం వేసుకుని అడ్మిరల్ గారింటికి టాక్సీలో వెళ్ళాడు లెడరర్. ఎడ్మిరల్‌గారు లోపల వున్నారుగాని, అత్యంత అవసరం ముఖ్యం. అందులోనూ ఆఫీసుపని అయితే తప్ప తనని డిస్టర్బ్ చెయ్యొద్దని స్టివార్టుకి చెప్పారు. ఓ అలాగే,

ఆయన్ని పిలువ్ అని లెడరర్ స్టివార్ట్‌ని లోపలికి పంపాడు. ఎడ్మిరల్ గారు బయటికొచ్చి; అతను చెప్పింది విని, కెప్టెన్ స్వీనీ వాషింగ్ టన్‌కి పంపమన్న మెసేజ్ ఇంకా వెళ్ళలేదని ఆ గందర గోళానికి కారణమైన వ్యక్తిమీద క్రమశిక్షణ చర్య తీసుకోవలసిందిగా తన ఆర్డర్సని, చెప్పి లోపలికి వెళ్ళిపోయాడు.

రాత్రి రెండుగంటల వేళప్పుడు లెడరర్, కెప్టెన్ స్వీనీని కలుసు కుని జరిగిందంతా చెప్పాడు.

"అయితే ఎడ్మిరల్‌గారు నీమీద క్రమశిక్షణ చర్య తీసుకోమని చెప్పారా, ఫలానా విధంగా అనికూడా చెప్పారా?" అన్నాడు కెప్టెన్ అంతా విని.

"ఫలానా అని లేదండి."

"అయితే సరే, ఈ ఉత్తరాలు అర్జంటుగా పోస్టులో పడాలి. ఇవి కూడా నువ్వు రేపిన గందర గోళానికి సంబంధించినవే కనుక వెంటనే లాంచీ తీసుకుని వెళ్ళి పోస్టుచెయ్యి. కవరకు స్టాంపులు అతికించే వున్నాయి. అడ్రసులు వ్రాసివున్నాయి. తోవలో ఓసారి చెక్ చేసి, అంటించి పడెయ్యి. టపా ఇంకో అరగంటలో తీసేస్తారు." అని తరిమాడు లెడరర్‌ని కెప్టెన్.

లాంచీలో దీపం వెల్తుర్లో వాటిని చదువుకున్నాడు లెడరర్. అవి మూడు ఉత్తరాలు. ఒకటి ఎస్టేటు ఏజెంటుకి, మరొకటి గాంజే ల్సుకి, మూడోది ఎడ్మిరల్‌కి. "మా కమ్యూనికేషన్ ఆఫీసరైన లెడరర్‌గాణ్ణి ఏప్రిల్ ఫూల్ చెయ్యడంలో తోడ్పడినందుకు వందనాలు. ఇంతమంచి ఏప్రిల్‌ఫూల్ జోకు ఇంతవరకు నే నెరగను ఇట్లు జె. జె. స్వీనీ." అని మూడు ఉత్తరాలూ ఒకటే కాపీ అవి.

(1-4-78)

(రీడర్స్ డైజస్ట్‌లో వచ్చిన ఒక ఉదంతం)